# దైనందినం

ప్రొద్దున్న తొమ్మిదింబావు.

హిమయత్ నగరులో మసీదు కెదురుగా సందు. ఆ సందులోంచి వస్తారు ఒక యువతి, ఒక యువకుడు. ఆ అమ్మాయి సన్నగా, పొడుగ్గా వున్న నొక్కుల జుట్టుని ఫేషనబుల్‌గా చుట్టచుడుతుంది. సన్నజాజిపూలు తెల్లగా, వంపుగా ఉంటాయి ఆ చుట్టమీద. చాలా నాజూకయిన చీరలు కట్టుకుంటుంది. కళ్లకి చలవజోడు, చేతిలో ఒక అందమైన అల్లిక సంచీ, ఇంక ఆ అబ్బాయి చామనచాయ, కనుముక్కు తీరు బాగుంటుంది. అతను గాగుల్స్ పెట్టుకుంటాడు. అతని చేతిలో న్యూస్ పేపరు, ఒకటి రెండు పుస్తకాలు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, లోకంతో సంబంధం లేనట్లుగా దేని వంకా చూడకుండా నడుస్తారు. రోడ్డు పొడుగునా వుండే ఇళ్లన్నింటి వంకా నిర్లిప్తంగా చూస్తుంది ఆ అమ్మాయి. కాని ఆ చూపులో భావమేమిటో ఎవ్వరికీ అర్థమయ్యే అవకాశం లేదు నల్ల కళ్ళ జోడు మూలాని. అతనేదో అనేసరికి ఆ అమ్మాయి సన్నగా నవ్వింది. కుడిచేతివైపున్న చిన్న మేడవైపు ఆ అమ్మాయి పరీక్షగా చూసింది. ఇంటిముందు పూలు నచ్చాయి ఆమెకి. ఏదో అంటుంది ఆ పూలను చూసి అతను తలూపాడు.

ఆ ఇల్లు బెంగాలీలది. ఒక ముసలాయన, ఆయన రెండో పెళ్లి భార్య, ఆవిడ సవితి కూతురు ఇరవై యేళ్ల పిల్ల ఉంటారు ఆ ఇంట్లో. తొమ్మిదింబావుకి ఆ అమ్మాయి మేడ మీద వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తుంటుంది. వీళ్లని చూడగానే ఒక కేక వేస్తుంది కీచు కంఠంతో. ఆ సవతి తల్లి పరుగెత్తు కొస్తుంది. ముందు ముందుకు వంగి వాళ్లిద్దరి వంకా చూస్తారు. ఏదో అనుకుంటారు. నవ్వుకుంటారు.

యువతీ, యువకులు నడుస్తుంటారు. ఒక సైకిలు షాపు. ఈ మాటు అతను చూస్తాడు తల తిప్పి. తొమ్మిదీ ఇరవైకి ఆ సైకిలు షాపు కుర్రాడు సైకిళ్లు 'ఆయిల్' చేస్తుంటాడు. ఆ అమ్మాయి వంక పరీక్షగా చూస్తూ, ఒక చోటునే రెండుసార్లు ఆయిల్ చేస్తాడు పొరపాటున. కళ్లతోనే తినేసేలాగ చూస్తాడు ఆ యజమాని. వీళ్లు కొంత దూరం పోగానే కుర్రాడు, యజమాని ఒకళ్ళనొకళ్ళు చూసుకుని భావస్ఫోరకంగా నవ్వుకుంటారు.

ఆ పక్కనే హొటలు, గోలగా రేడియో అరుస్తుంటుంది. ప్రొప్రైటరు తన గడియారం 'కీ' ఇచ్చేవేళ అది. ఈ జంటను చూడగానే చటుక్కున వాచీ తీసి 'కీ' ఇస్తాడు. రేడియో ఒక మాటు అటూ ఇటూ తిప్పి ఆ అబ్బాయినీ, ఆ అమ్మాయినీ కలిపి ఒక్క మాటే చూసేస్తాడు.

వాళ్లు నారాయణగూడ జంక్షన్ దాటి బస్‌స్టాపు దగ్గరికి వెడతారు. తొమ్మిదీ ఇరవై ఐదుకి బస్ వస్తుంది. ఆ అమ్మాయి బస్ ఎక్కుతుంది. అతను చెయ్యి వూపుతాడు. బస్ వెళ్లిపోతుంది.

రాత్రి ఏడూ ఏభై ఐదు...

నారాయణగూడ సినిమా హాలు దగ్గర బస్సు ఆగుతుంది. అమ్మాయి, అబ్బాయి బస్ దిగి నారాయణగూడ జంక్షన్ దాటి, హిమయత్ నగరు రోడ్డుమీద నడుస్తుంటారు. మళ్లా హోటలు, ఆకుపచ్చ లైట్లు, అద్దాల బీరువాలు, ఫలహారాలు. ఆ హోటలు ప్రొప్రైటరు తన స్నేహితుడికి స్పెషల్ కాఫీ ఇప్పించి బాతాఖానీ వేస్తున్నాడు. స్నేహితుడు ఠక్కున మాటలాపేసి వీళ్ళ వంక చూశాడు. ఆ అమ్మాయి పక్కన షాపులోంచి పడే నీలం దీపం వెలుతురులో మెరుస్తోంది. 'స్ట్రయికింగు బ్యూటీ!' అన్నాడు స్నేహితుడు. హోటలు యజమాని తలతిప్పి చూసి గుర్తించాడు వీళ్లని.

"రోజూ ఇదే వేళకి ...... సరిగ్గా ఎనిమిదింటికి వెడతారీ వైపు. ఆ అమ్మాయిని చాలా రోజులుగా చూస్తున్నాను. మరి యితనెవరో?" స్నేహితుడు కుతూహలంతో ముందుకు వంగి మెల్లిగా అడిగాడు "ఐతే పెళ్లి కాలేదంటావా?"

"ఏమో మరి. ఆ అమ్మాయి ఎక్కడో పని చేస్తున్నట్లుంది. ఈ మధ్యేననుకుంటా వీళ్ల పరిచయం. కానీ .. మహా ఉల్లాసంగా ఉంటారోయి ఎప్పుడు చూసినా." సిగరెట్టు వెలిగించిన స్నేహితుడు ఒక దమ్ము లాగి గాలిలో ఉంగరాలుగా పోయే పొగ వంక చూశాడు.

"చూడు! పెళ్లయినా కాకపోయినా ప్రేమలో మునిగి వున్న వాళ్లు అల్లాగే వుంటారోయి నిత్యానంద జీవులల్లే! లోకమే దివ్యంగా కనుపిస్తుంది వాళ్ల కళ్లకి! అదృష్టవంతులు!" ఒక నిట్టూర్పు విడిచాడు ఆ భావుకుడు.

యువతి, యువకుడు సైకిలు షాపు సమీపించారు........

పెట్రోమాక్సు లైటు వెలుతురులో న్యూస్ పేపరు చూస్తున్నాడు యజమాని. ఎవరో కుర్రాడు సైకిలు తీసుకొచ్చి పెట్టాడు షాపులో.

"మూడు గంటలు" అన్నాడు యజమాని రోడ్డు వైపు చూస్తూ.

"ఎక్కడా? 7.45 ఐందిప్పుడు. ఐదింటికి తీసుకెళ్లాను.." యజమాని గడియారం వంకైనా చూడకుండా "ఎనిమిది ఇప్పుడు. నీ గడియారం స్లో" అన్నాడు. ఆ కుర్రాడు డబ్బిచ్చేసి వెళ్లిపోయాడు మీమాంస పడకుండా. అతను వెళ్లగానే షాపులోని పనివాణ్ణి చూసి నవ్వాడు యజమాని.

"టైము కరక్టాండీ?" అన్నాడు పనివాడు కూడా నవ్వుతూ.

"ఔనోయ్! అదుగో చూడు జంట!! గడియారాలు తప్పినా వాళ్లు తప్పరు."

కుర్రాడు ఇదివరకే చూశాడు. "ఔనుగానీండి. ఎవరంటారు వీళ్లు? ఆ అమ్మాయి మాత్రమండీ... ... "

"మరే. బహు నాజూగ్గా ఉంటుంది. ఈ మధ్యే పెళ్లయింది కాబోలు. రోజూ బస్సు ఎక్కించాలి, దింపాలి! ఇట్లా ఉన్నాయి రోజులు!'

కుర్రాడు ముసి ముసి నవ్వులు నవ్వాడు. "ఔనండి.. అల్లాగే అనిపిస్తుంది. ఇంకా చూశారో లేదో ఎప్పుడూ నవ్వేనండి ఆవిడ ముఖాన" యజమాని తన ఉంగరాలు సవరించుకున్నాడు. 'ఊ' అని ఒకసారి మూలిగి పేపర్లో పడ్డాడు.

అమ్మాయి, అబ్బాయి ముందుకు సాగారు... మేడ, తోట. పైన బాల్కనీలో లైటు వెలుగుతోంది. ముసలాయన, రెండో పెళ్లి భార్య కుర్చీల్లో కూచొని ఉన్నారు. ఆవిడ దూరాన్నుంచే వీళ్లని గుర్తు పట్టి కుర్చీలోంచి లేచింది.

"అదుగో చూడండి" అన్నది ముసలాయనతో. ఆయన కూడా లేచి నుంచున్నాడు. ఆ అబ్బాయి పూలదండ అందించాడు. ఆ అమ్మాయి అటూ ఇటూ చూసి తల్లో తరుముకుంది.

"ఏమిటి చూసేది?" అన్నాడు ముసలాయన చిరాకుగా.

"అదే అన్యోన్యత. రోజూ ఇదే వరస.. పొద్దున్నే వెడతారు. ఈపాటి వేళ తిరిగొస్తారు. ఎప్పుడూ నవ్వే ఆ పిల్ల ముఖాన. అదృష్టవంతురాలు."

ముసలాయనకి వళ్లు మండుకొచ్చింది. "ఇప్పుడు నీకు ఏం తక్కువైందని? అందర్నీ చూసి అల్లా కళ్ల నీళ్లెట్టుకుంటావు. రోజూ యిదే వరస. వాళ్లు రాగానే పెద్ద పనున్న దానల్లే చూస్తావు. ఒళ్లు మండుతుంది" ఆయన ధాంధూంలాడుతూ లోపలికెళ్లాడు. ఆవిడ సణుక్కుంటూ కుర్చీలో కూలబడింది.

ఆ అమ్మాయి, అబ్బాయి మసీదు కెదురుగా సందులోకి తిరిగారు.. పెద్ద మేడ ముందు ఆగారు. ఆ అమ్మాయి తాళం తీసింది. లోపలికెళ్లి లైటు వేసింది.. అతను పుస్తకాలు కిటికీలో పడేశాడు.

"ఏమంటావు యింతకీ?" అన్నాడతను. ఆ అమ్మాయి చెప్పులు తీసి ఒక మూలకి విసిరింది.

"ఏమంటాను? ఎల్లుండి ప్రొద్దున్నే బయలుదేరి వెళ్లాలంటాను. ఎన్ని సార్లు చెప్పాను ఆ మాట నీకు?"

"అది కాదు... విను నామాట... ఎందుకొచ్చిన ఖర్చు? పినతల్లి ఆడపడుచు కూతురంటే దగ్గర చుట్టం కాదు. ఆవిడ పెళ్లికి వెళ్లకపోతే ఏమిటి యిబ్బంది? ఎందుకిప్పుడు ఏభై రూపాయలు ఖర్చు అంటాను. కాస్త ఆలోచించు" అతను కాస్త చిరాగ్గానే మాట్లాడుతున్నాడు.

"ఔను. నీకన్నీ అనవసరం ఖర్చులుగానే కనిపిస్తాయి. పెళ్లి ముందు చెప్పిన మాటలన్నీ ఏమైనాయో? నన్ను అందలం ఎక్కించేట్లుగా చెప్పావు కబుర్లు. ఆ అమ్మాయి నాకు స్నేహితురాలు. నేను వెళ్లి తీరాలి."

అతను కుర్చీలోంచి లేచి కిటికీలో పుస్తకాలు తీసుకున్నాడు. "సరే నీ యిష్టం. ఏకు మేకువై కూర్చుంటావని అనుకోలేదెప్పుడూ. పెళ్లి ముందు నువ్వూ చెప్పావు చాలా కబుర్లు. నా మాటంటే వేదం అన్నట్లు ప్రవర్తించావు. ఇప్పుడు..."

ఆ అమ్మాయి ఉక్రోషం ఆపుకోలేకపోయింది. "ఔను! పరమ గయ్యాళినైనాను. పోనీలే! చేసుకున్న వారికి చేసుకున్నంత. ఏం చేస్తావు నీ దురదృష్టం? పద అన్నం తిందాం" అన్నదా అమ్మాయి.. వంటింటి తలుపు గొళ్లెం తీస్తూ...

ఆ అబ్బాయి పేపర్లో తల దూర్చాడు.

"నాకఖ్ఖర్లేదు. నువ్వు తిను."

"సరే! నాకూ ఆకలి లేదు" గబగబ ఒక తలగడ, దుప్పటి తీసుకొచ్చి మంచం వాల్చింది. "ఇంక శయనించండి" అన్నది.

అతను మొహం మాడ్చుకుని మంచం మీద వాలాడు.. సిగరెట్టు వెలిగించి కిటికీలోంచి ఆకాశం వంక చూస్తూ పడుకున్నాడు.

ఆమె వంటిల్లు వూడ్చి అక్కడే ఒక చాప వేసుకుని పడుకుంది. ఆ రాత్రి ఉపవాసం. జాగారం ఆ జంటకి.....

తెల్లవారి తొమ్మిదింపావు....

మసీదు కెదురుగా సందులోంచి రోడ్డు మీదకు వచ్చారు ఆ అమ్మాయి, అబ్బాయి.. బెంగాలీల మేడ దాటారు. ఆ రెండో పెళ్లి భార్య, సవితికూతురు బాల్కనీలోకి వచ్చి తొంగి చూశారు.

సైకిలు షాపు, హొటల్ దాటారు ఆ జంట. కంఠాలు తగ్గించి మాట్లాడుకుంటూ బస్‌స్టాపు చేరారు. బస్ వచ్చింది. ఆ అమ్మాయి ఎక్కింది. అతను చిరునవ్వుతో చెయ్యి వూపాడు.